క్లుప్తంగా

అనాథ బాలలకు అల్పాహారం



చిన్నారులకు ఎగ్జామ్ ప్యాడ్స్, కంపాస్ కిట్లు అందిస్తున్న డీవీఆర్

పెదగంట్యాడ: డీవీఆర్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు డీవీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక జనరేషన్ యువ అనాథశ్రమంలోని 30 మంది బాలలకు ఆదివారం అల్పాహారం అందజేశారు. అలాగే చిన్నారులకు ఎగ్జామ్ ప్యాడ్స్, కంపాస్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీవీ శంకరరావు, సూర్యచంద్ర, పితాని శ్రీను, డీవీటీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మూర్తి కుటుంబానికి పరామర్శ



మంత్రి మూర్తి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కొణతాల

పెదగంట్యాడ: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన మంత్రి మూర్తి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆదివారం పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి రాజశేఖర్, మంత్రి శంకరనారాయణతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆయన వెంట 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, పల్లా చినతల్లి తదితరులున్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు అందిస్తున్న రామారావు

అగనంపూడి: మాతృ దినోత్సవం సందర్భంగా 79వ వార్డు పాత అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడుతూ మాతృమూర్తి గొప్పదనం, త్యాగం గురించి వివరించారు. తల్లికి సేవ చేయడంలో ఉన్న ఆనందం, అనుభూతి ఇంకెక్కడా పొందలేమన్నారు. కార్యక్రమంలో ముత్యాల అప్పారావు, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్ట్‌కార్డు ఉద్యమం



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ ఉత్తరాలు రాస్తున్న స్థానికులు

ఆరిలోవ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉత్తరాలు రాసే కార్యక్రమం నిర్వహించింది. ముందుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను స్థానికులకు వివరించారు. అనంతరం సుమారు 60 మంది 'స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి'అంటూ ప్రధాన మంత్రి మోదీకి ఉత్తరాలు రాశారు. జేఏసీ కన్వీనర్ ప్రియాంక మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన సుమారు 8 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వకుండానే పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పలు కమిటీలు చేపడుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొనాలని ఆమె కోరారు. పోస్టు కార్డు ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు జగన్, నిశ్చల్, నాగరాజు, హర్ష పాల్గొన్నారు.

దశాబ్దాల కల .. నెరవేరుతున్న వేళ..

- గాజువాకలో హౌస్ కమిటీ పట్టాలకు హక్కులు
- ఏపీఐఐసీ నిర్వాసితులకు స్థలాల మంజూరుకు ఏర్పాట్లు
- కర్ణవానిపాలెం నిర్వాసితులు, ఫార్మాసిటీ నిర్వాసిత మేజర్ సన్స్‌కు స్థలాలు
- ఎమ్మెల్యే నాగిరెడ్డి చొరవతో రాష్ట్రప్రభుత్వం చర్యలు

గాజువాక : గాజువాకలో పెండింగ్ సమస్యలకు విముక్తి లభించింది. దశాబ్దాల తరబడి ఉన్న పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తన మాట నిలబెట్టుకున్నారు.

హౌస్ కమిటీ పట్టాలకు హక్కులు

- 7,027 మందికి చేకూరనున్న లబ్ధి



హౌస్ కమిటీ ప్రాంతం

గాజువాక హౌస్ కమిటీలో జీవో నంబర్ 301 ప్రకారం పొందిన క్రమబద్ధీకరణ పట్టాలకు సర్వ హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలను ప్రారంభించింది. పట్టాలకు పూర్తి హక్కులను హక్కులను కల్పించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో నంబర్ 71ను జారీ చేసిన ప్రభుత్వం తాజాగా దానికి సంబంధించిన చర్యలను చేపట్టింది. తాజా చర్యలతో లబ్ధిదారులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వనుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత లబ్ధిదారులు తమ ఆస్తిని వారసులకు బదిలీ చేసుకోవడం, బ్యాంకు రుణాలను పొందడం, అవసరాలకు అమ్మడం వంటి హక్కులను పొందుతారు. జీవో నంబర్ 71 ద్వారా హౌస్ కమిటీలో 7,027 మంది లబ్ధి పొందుతారు. రెండో దశలో మరో 1300మంది లబ్ధి పొందనున్నట్టు అధికారులు తెలిపారు.

ఏపీఐఐసీ నిర్వాసితులకు స్థలాలు

- నలభై ఏళ్లనాటి సమస్యకు మోక్షం

ఒకటి కాదు, రెండు కాదు.. పారిశ్రామిక అవసరాల కోసం భూములను ఇచ్చిన తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ నాలుగు గ్రామాల రైతులు 40 ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కనికరం లేని అధికారులు కారణాలు చూపి చేతులెత్తేస్తూ వచ్చారు. ఈ సమస్య ముందుకొచ్చిన తరువాత ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మారారు. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం పరిష్కార చర్యలకు అధికారులను ఆదేశించడంతో ఆగమేఘాలపై వారసుల వెరిఫికేషన్‌ను నిర్వహిస్తున్నారు.

గాజువాక నియోజకవర్గంలోని తుంగ్లాం, ఫకీర్‌తక్యా, యాదవజగ్గరాజుపేట, వడ్లపూడి గ్రామాలకు చెందిన రైతుల నుంచి ఏపీఐఐసీ అధికారులు పారిశ్రామిక అవసరాల కోసం 1966 నుంచి 82వరకు దశలవారీగా 796 ఎకరాలను తీసుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలను ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు



ఎమ్మెల్యే నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న టీడీపీ కార్పొరేటర్లు (ఫైల్)

చేయకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. దీంతో 1997లో 15ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ భూమిని 247 మంది రైతులను పంచుకోమన్నారు. వారికి పట్టాలు ఇవ్వకపోవడంతో అది మరుగున పడిపోయింది. రైతుల అవార్డు కాపీలు కనిపించకపోవడంతో పట్టాలు ఇవ్వలేకపోతున్నామని రెవెన్యూ సిబ్బంది చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో పెందుర్తి నియోజకవర్గానికి ఆరుగురు ఎమ్మెల్యేలు మారగా, ఆ తరువాత ఏర్పడిన గాజువాక నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు తమ పదవీ కాలాన్ని పూర్తి చేశారు. వారిచుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరిగిప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఈ సమస్య 40 ఏళ్లగా నలుగుతుండటంతో నిర్వాసితుల వారసులు పెరిగారు. అందువల్ల కొత్తగా సర్వే నిర్వహించి వారందరికీ అవార్డులివ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్యేకు టీడీపీ కార్పొరేటర్ల కృతజ్ఞతలు

దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉండిపోయిన ఏపీఐఐసీ నిర్వాసితుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించినందుకు టీడీపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యే నాగిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆయా గ్రామాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జీవీఎంసీ కార్పొరేటర్లు కాకి గోవిందరెడ్డి (69వ వార్డు), లేళ్ల కోటేశ్వరరావు (86వ వార్డు), బొండా జగన్ (87వ వార్డు), మొల్లి ముత్యాల నాయుడు (88వ వార్డు) తదితరులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్వాసితులందరికీ న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టడం హర్షణీయమని పేర్కొన్నారు.

కర్ణవానిపాలెం నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం తమ ఇళ్లు, భూములను వదులుకున్న కర్ణవానిపాలెం నిర్వాసితులకు ఇళ్ల స్థలాల మంజూరు సమస్య కొలిక్కి వచ్చింది. దాదాపు 38 సంవత్సరాల తరువాత అధికారులు వారికి ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు లే అవుట్‌ను సిద్ధం చేశారు. అగనంపూడి ప్రాంతానికి చెందిన ఈ కాలనీవాసులు అప్పట్లో తమ ఇళ్లు, భూములను స్టీల్‌ప్లాంట్ కోసం వదులుకున్నారు. దీంతో వారికి ఇళ్ల స్థలాలను ఇవ్వాల్సి ఉన్నప్పటికీ తమ ప్రాంతంలోనే తమకు స్థలాలు ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ విషయంపై ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దరిమిలా స్పందించిన అధికారులు అగనంపూడి వద్ద సర్వే నంబర్ 156లో లే అవుట్‌ను రూపొందించి, అర్హులందరికీ స్థలాలను కేటాయించే విధంగా చర్యలు చేపట్టారు.



కర్ణవానిపాలెం నిర్వాసితుల కోసం సిద్ధం చేసిన లే అవుట్

ఫార్మాసిటీ మేజర్ సన్స్‌కు పట్టాలిచ్చేందుకు ఏర్పాట్లు

ఫార్మాసిటీ కాలనీలలో మేజర్ సన్స్‌కు సంబంధించిన ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫార్మా నిర్వాసితుల పిల్లల్లో 2010 సంవత్సరం లోపు మేజర్‌లైన సుమారు 174 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ఆ కాలనీలో అర్హులందరూ డిమాండ్ చేస్తూ వచ్చారు. వారిలో 30 మందికి గతంలో పట్టాలిచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. మిగిలినవారికి పట్టాలు ఇవ్వకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి ఈ సమస్యను ఆ ప్రాంత కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ తీసుకెళ్లారు. ఆయన అధికారులను ఆదేశించడంతో సమస్య పరిష్కారం కొలిక్కి వచ్చింది. అర్హులకు పట్టాలను అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాకింగ్ ట్రాక్ వద్ద చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉక్కు అధికారి చంద్రశేఖర్

అగనంపూడి: వాకర్లు, ఉక్కు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సౌకర్యం కోసం అగనంపూడి వాకింగ్ ట్రాక్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని విశాఖ స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ మేనేజర్ వై.చంద్రశేఖర్ అన్నారు. అగనంపూడి వాకింగ్ ట్రాక్ వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణరావు, వాకర్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మడుగల నరసింగరావు, బి.రామారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనాథు వర్షిణికి అభినందన



వర్షిణిని అభినందిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి, కలెక్టర్ నుంచి ప్రశంసలు అందుకున్న శ్రీనాథు వర్షిణిని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అభినందించారు. సంజీవగిరి కాలనీ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పని చేస్తున్న శ్రీనాథుని శ్రీనివాస్ కుమార్తె వర్షిణి గాజువాక హైస్కూల్‌లో చదువుతూ, పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గానూ 578 మార్కులు సాధించింది. ఆమెను కార్పొరేటర్ తన కార్యాలయంలో ఆదివారం సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దింటి మంగునాయుడు, జానా సతీష్, పెంద్రరాజు, కేకే మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామదూతం.. శిరసా నమామి

భక్తాగ్రణ్యుడు, అంజనీ సుతుడికి ఆదివారం విశేష పూజలు చేశారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని వాడవాడలా వేడుకలు నిర్వహించారు. రామభక్త హనుమాన్ కీ జై అంటూ కీర్తించారు. ఆలయ ప్రాంగణాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

- వాడవాడలా హనుమజ్జయంతి
- అంజనీపుత్రుడికి ప్రత్యేక పూజలు



తుంగ్లాంలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

కూర్మన్నపాలెం: హనుమాన్ జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 87వ వార్డు కణితి కాలనీ కాళింగవీధి గాంధీ బొమ్మ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కణితి గ్రామదేవత కమిటీ చైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ప్రగడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పుస్తకాల పంపిణీ

87వ వార్డు వడ్లపూడి నిర్వాసిత కాలనీలోని రామాలయం వద్ద భక్తులకు హనుమాన్ చాలీసా పుస్తకాలను ఉచితంగా అందజేశారు. స్వామి వారిని సిందూరంతో ప్రత్యేకంగా అలంకరించారు. హోమం నిర్వహించారు. అనంతరం అనాథ పిల్లలకు ఆలయ ప్రాంగణంలో భోజన ఏర్పాట్లు చేసి, బహుమతులను అందజేశారు. ఆంజనేయ స్వామి ముద్రతో ఉన్న జెండాలను భక్తులకు పంపిణీ చేయడంతో పాటు స్వామి వారికి అలంకరణ చేసిన సిందూరాన్ని భక్తులకు పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో వడ్లపూడి ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: 75వ వార్డు నెల్లిముక్కు రామాలయం పక్కన గల హనుమాన్ ఆలయంలో విశేష పూజలు చేశారు. స్వామి వారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి ఎల్లయ్యరెడ్డి దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారంభించారు.



వడ్లపూడి నిర్వాసితకాలనీలో సిందూర అలంకరణలో ఆంజనేయస్వామి

– బీసీ రోడ్డులోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ అర్చకుడు సీతాపతి శర్మ ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, పంచామృతాభిషకాలు, సిందూర సహిత నాగవల్లీ దళార్చన నిర్వహించారు. స్వామి వారికి



బీసీ రోడ్డులోని భక్తాంజనేయస్వామి

ప్రీతిపాత్రమైన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- దయాల్‌నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి, నడుపూరులోని హనుమాన్ ఆలయం,76వ వార్డు నడుపూరులోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని కులుకూరి మంగరాజు, ప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు.

ఉక్కునగరం: ఉక్కు స్టేడియం ఎదురుగా ఉన్న హనుమాన్ ఆలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు భజనలు చేశారు. పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

- సెక్టార్-1లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని దాసాంజనేయ స్వామికి వేకువజామున పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు భావనారాయస్వామి నేతృత్వంలో అప్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం స్వామికి వడలతో సహస్ర నామార్చన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్వతాంజనేయస్వామి సన్నిధిలో హోమాలు

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు వివేకానంద కాలనీలో కొలువైయున్న పర్వతాంజనేయ స్వామి సన్నిధిలో హోమాలు నిర్వహించారు. వడలు, అప్పాలు, తమలపాకులు, నిమ్మకాయలతో స్వామిని అలంకరించారు. ఆలయ ధర్మకర్త ఎం.మాధురి ఆధ్వర్యంలో



నెల్లిముక్కు రామాలయంలో అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

జరిగిన పూజా కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

– భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న గిరిపై వెలసిన దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

– 69వ వార్డు తుంగ్లాంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ విజయరాఘవ స్వామి ఆలయ 10వ వార్షికోత్సవాలను వైభవంగా జరిపించారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్న సమారాధనను ప్రారంభించారు. పరిసర ప్రాంతాల భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.



ఉక్కు వెంకన్న ఆలయంలో దాసాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో దాసాంజనేయస్వామి

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

అగనంపూడి: పినమడకలోని దాసాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయానికి చేరుకుని అభిషేకాలు జరిపించారు. సెక్టార్-1 నిర్వాసిత కాలనీల భక్తులు పాల్గొని, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమిస్తున్నారన్న ఉక్రోషంతోనే ఉత్పత్తి నిలిపివేత

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమిస్తుందన్న ఉక్రోషంతోనే స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 822వ రోజు ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం కూడా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నిస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

అ'పూర్వ' సంగమం



అగనంపూడి హైస్కూల్ పూర్వవిద్యార్థులు

పాతికేళ్ల అనంతరం కలుసుకున్న మిత్రబృందం

అగనంపూడి: బాల్యం ఓ వరం. చిన్ననాటి స్నేహితులను కలిస్తే ఆ ఆనందం వర్ణనాతీతం. దశాబ్దాలు గడిచిపోయినా అది ఇగిరిపోని స్నేహసుగంధం. ఆ స్మృతుల పరిమళాలు కాలాన్ని వెనక్కి తిప్పి కనుల ముందు సాక్షాత్కరింపజేస్తే.. ఆ అనుభూతినే పొందింది పాతికేళ్ల అనంతరం కలుసుకున్న ఓ మిత్రబృందం. అగనంపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు వంద మంది అగనంపూడిలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి అల్లరిని తలచుకుని ఆట పట్టించారు. మళ్లీ నాటి జ్ఞాపకాలతో, కుటుంబసభ్యులతో కలిసి సంబరాలతో గంటలు క్షణాలుగా గడిచిపోయాయి. అనంతరం భారత సైన్యంలో పనిచేస్తున్న సహచర మిత్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు. మళ్లీ కలుసుకోవాలంటూ భారమైన మనసులతో వీడ్కోలు తీసుకున్నారు.

నిత్యావసర సరకుల అందజేత

అగనంపూడి: దువ్వాడ సెక్టార్-1కు చెందిన గుర్రాల నరసమ్మ చేయి విరిగి ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నిత్యావసర సరకులను అందించింది. మాతృ దినోత్సవం సందర్భంగా ఉక్కు అధికారి కె.ఎస్.ఎస్.సత్యనారాయణ మూర్తి ఆర్థిక సహకారంతో నెలకు సరిపడా బియ్యం, పప్పు దినుసులు, నూనె ఇతర వంట సామగ్రిని నరసమ్మకు అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు, మస్తాన్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, ఎస్.గోవిందరావు, ఎల్.రాము, ఎ.వి.కృష్ణ పాల్గొన్నారు.



సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

సమస్యను ఎదుర్కోగలిగితే భవిత ఉజ్వలం

అగనంపూడి: విద్యార్థులు సమస్యను ఎదుర్కొనే శక్తిని కల్గి ఉంటే భవిష్యత్ ఆశాజనకంగా, ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని దువ్వాడ విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. విజ్ఞాన్ ఎంబీఏ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎవరెవరు ఏమేం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో చాలామంది ఉన్నత ఉద్యోగాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, ఎంబీకే విభాగాధిపతి మురళి తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ ఎంబీఏ కళాశాల పూర్వ విద్యార్థులు

అనుసంధాన వంతెన నిర్మాణానికి రైల్వే మంత్రి ఆమోదం

- అనకాపల్లి ఎంపీ సత్యవతి

అగనంపూడి: లంకెలపాలెం రైల్వే క్రాసింగ్‌ను అనుసంధానం చేస్తూ వంతెన నిర్మాణానికి రైల్వే శాఖామంత్రి ఆమోదం తెలిపారని అనకాపల్లి ఎంపీ సత్యవతి తెలిపారు. స్థానిక నాయకులు ఆదివారం ఎంపీ సత్యవతిని కలిసి లంకెలపాలెం వంతెనతో పాటు పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంతెన నిర్మాణాన్ని రైల్వే నిధులతో చేపడతారని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు సుందరపు అప్పారావు, యలమర్తి వెంకటరావు, కాతా నూకేశ్వరరావు, దిగుమర్తి కాశీరావు తదితరులున్నారు.



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు